

దర్శన్.. ఖైదీ నెంబరు 6106

బెంగళూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్‌కు విచారణ ఖైదీగా 6106 నెంబరు కేటాయించారు. పరప్పన అగ్రహార జైలులో నటుడు దర్శన్ ఇతర నిందితులు ఉన్నారు. అనుచరులు ధనరాజ్‌కు 6107, వినయ్ 6108, ప్రదోష్‌కు 6109 నెంబర్లు కేటాయించారు. కాగా సోమవారం నగరంలోని పరప్పన జైలులో ఉన్న దర్శన్‌ను పరామర్శించేందుకు భార్య విజయలక్ష్మి, కుమారుడు వినీశ్ వచ్చారు. భార్య, పిల్లలను చూడగానే దర్శన్ కన్నీరు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ధైర్యంగా ఉండాలని, చట్టపరంగా పోరాడదామని భార్య భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది.

చెన్నపట్టణ నుంచి పోటీ చేయను

- మాజీ ఎంపీ డీకే సురేశ్
- ఎవరేమనుకున్నా వదిలేది లేదు : డీసీఎం


బెంగళూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్టణ శాసనసభ నియోజకవర్గం హాట్ టాపిక్‌గా మారింది. కుమారస్వామి కేంద్రమంత్రి కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యం కానుంది. ఇక్కడి నుంచే కుమారస్వామి వారసుడు నిఖిల్, డీసీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ పోటీ చేస్తారనే ప్రచారం సాగింది. అయితే రెండు రోజులుగా పలువురి వ్యాఖ్యలు మలుపులు తిరిగాయి. చెన్నపట్టణ నుంచి నిఖిల్ పోటీ చేయరని కేంద్రమంత్రి కుమారస్వామి ఆదివారం ప్రకటించారు. దీంతో నిఖిల్ ఇటువైపు రారనేది ఖరారైంది. మరోవైపు బెంగళూరు గ్రామీణ నుంచి ఓటమి చెందిన డీకే సురేశ్‌ను చెన్నపట్టణ ఎమ్మెల్యే చేయాలని డీకే శివకుమార్ భావిస్తున్నారు. గత వారం ఒకేరోజు నియోజకవర్గంలోని ఏకంగా 14 ఆలయాలను సందర్శించడం ద్వారా ఇక్కడ నుంచి రాజకీయం చేస్తానని సందేశమిచ్చారు. తాజాగా డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలు హల్‌చల్ చేస్తున్నాయి. తాను చెన్నపట్టణ నుంచి పోటీ చేసేది లేదని తేల్చి చెప్పారు. ప్రజలు విశ్రాంతి తీసుకోవాలని సూచించారన్నారు. ఓటమి చెంది నెలరోజులు కాలేదని, అంతలోనే ఎన్నికలకు వెళ్తే ప్రజలు నవ్వుతారని సోమవారం సదాశివనగర్‌లోని ఇంటి వద్ద మీడియాకు తెలిపారు. మా గురించి మాట్లాడకుంటే కుమారస్వామికి రోజు గడవదని ఎద్దేవా చేశారు. అయితే సూరజ్ రేవణ్ణ విషయంలో దేవెగౌడ కుటుంబం గురించి మాట్లాడడం తప్పు అవుతుందన్నారు. కానీ చెన్నపట్టణలోని కొడంబళ్ళి, అక్కూరు జిల్లా పంచాయతీలలో డీసీఎం డీకే శివకుమార్ 'గడప చెంతకు ప్రభుత్వం - సేవకు ఉండాలి సహకారం' అనే కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరేమనుకున్నా పట్టించుకోనని, చెన్నపట్టణను వీడేది లేదన్నారు. తాలూకా స్థాయి అధికారులతో అన్ని వినతులకు పరిష్కారం చూపుతానన్నారు. దీన్నిబట్టి చెన్నపట్టణ అంశం హాట్ టాపిక్ అవుతోంది.



డీకే సురేశ్


ప్రజల వినతులు స్వీకరిస్తున్న డీసీఎం

బీజేపీలో మార్పు తప్పదా..?

- ప్రతిపక్షనేత, రాష్ట్ర అధ్యక్ష పదవులపై పలువురి గురి
- పెరుగుతున్న యడియూరప్ప వ్యతిరేక వర్గీయులు
- నాయకుల్లో కొరవడిన ఐక్యత
- రాష్ట్రంలోని పరిణామాలపై అధిష్ఠానం దృష్టి





బెంగళూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలో పలుమార్పులు జరగవచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు ఆశావహులు కీలక పదవుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాల్లో జేడీఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోగా 17 స్థానాల్లో మాత్రమే బీజేపీ విజయం సాధించింది. మరో రెండుస్థానాల్లో జేడీఎస్ గెలిచింది. 2019 లోక్‌సభ ఎన్నికల వేళ రాష్ట్రంలో జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఉండేది. బీజేపీ సొంతంగా పోటీ చేసి 25 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్, జేడీఎస్ చెరోస్థానానికి మాత్రమే సరిపెట్టుకోగా, మండ్య నుంచి బీజేపీ పరోక్ష మద్దతుతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా సుమలత గెలుపొందిన విషయం తెలిసిందే. ఇదే తరుణంలో నాయకత్వం కోసం ఒక్కలిగ ముఖ్యుల మధ్య పైపోటీ జోరుగానే సాగుతోంది. మరోవైపు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర అంతర్గతంగా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. పార్టీలో యడియూరప్ప కుటుంబాన్ని వ్యతిరేకించేవారి సంఖ్య పెరుగుతోంది. అందులోనూ కుమారస్వామి కేంద్ర కేబినెట్‌లో కీలకమైనశాఖ మంత్రి కావడంతో ఈ అంతర్గత విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఎన్డీయే ప్రభుత్వంలో కుమారస్వామి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఒక్కలిగ సమాజానికి ఆయనే ముఖ్యుడని పరోక్షంగా ఒప్పుకున్నట్లయ్యింది. రానున్న బెంగళూరు పాలికె ఎన్నికలతోపాటు జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు ఒక్కలిగ నాయకత్వాన్ని బలోపేతం చేయాల్సి ఉందని ఆ పార్టీ నాయకులు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆదివారం పెట్రో చార్జీల పెంపుపై బీజేపీ నిరసన కొనసాగించింది. ప్రతిపక్షనేత అశోక్, మాజీ ఉపముఖ్యమంత్రి అశ్వత్థనారాయణ ప్రత్యేకంగా మీడియాతో మట్లాడడం.. దీన్నిబట్టి బీజేపీలో అంతా సక్రమంగా ఉందని చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఇక మరో కీలక నేత సీటీ రవి చిక్కమగళూరులో ప్రత్యేకంగా పెట్రో ఉత్పత్తులపై ఆందోళన చేశారు. రాష్ట్ర స్థాయిలో బెంగళూరు కేంద్రంగా జరిగే నిరసనలో అందరూ పాల్గొనాలని సూచించినా ఆయన హాజరు కాకపోవడం కూడా అంతర్గత పోరుకు బలం చేకూరుస్తోంది. పార్టీలో విజయేంద్ర, అశోక్‌ను ఇద్దరినీ మార్పు చేసి ఇతరులను నియమించాలనే ప్రయత్నాలు సాగుతున్నాయి. వీరి కార్యవైఖరిపై ఎమ్మెల్యేలతోపాటు పలువురు ముఖ్యనేతలు అసంతృప్తితో ఉన్నారు. బహిరంగంగా మాత్రం ఎవరూ వ్యాఖ్యానించలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందే ప్రతిపక్ష నేత అశోక్ మార్పుపై ఒత్తిళ్లు వచ్చాయి. ఎన్నికలవేళ ఈ అంశానికి పార్టీ అగ్రనేతలు ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసి కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడ్డం, కేబినెట్ కూర్పుతో పాటు పార్లమెంటు సమావేశాలు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో అగ్రనేతలు రాష్ట్రం వైపు ఆలోచించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు విధానపరిషత్ ప్రతిపక్షనేతగా వ్యవహరించిన కోట శ్రీనివాసపూజారి లోక్‌సభ సభ్యుడయ్యారు. దీంతో ఈ స్థానానికి రాష్ట్ర, జాతీయస్థాయిలో వివిధ హోదాల్లో వ్యవహరించిన సీనియర్ నేత సీటీ రవికి అవకాశం కల్పిస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే శాసనసభలో ప్రతిపక్షనేత మార్పు ఉంటుందనిపిస్తోంది. శాసనసభలో ప్రతిపక్షనేత హోదా కోసం ఎమ్మెల్యే సునిల్‌కుమార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు సీనియర్ నేత బసనగౌడ పాటిల్ యత్నాళ్, ప్రతిపక్షనేత లేదా పార్టీ అధ్యక్ష పదవిలో కీలక హోదా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. అధ్యక్ష పదవి నుంచి విజయేంద్రను మార్పు చేస్తే యడియూరప్ప ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని అగ్రనేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న కుమారస్వామి

కన్నడలో ప్రమాణం చేసిన కుమారస్వామి

బెంగళూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ తొలి సమావేశాల ప్రారంభంలో ఇటీవల విజయం సాధించిన సభ్యుల ప్రమాణ స్వీకారాలు ప్రారంభమయ్యాయి. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి కన్నడలో దేవుడి పేరిట ప్రమాణం చేశారు. ఇదే విషయాన్ని సోమవారం 'ఎక్స్'లో పంచుకున్నారు. 18వ లోక్‌సభ సభ్యుడిగా, మండ్య ప్రజల ప్రతినిధిగా ప్రమాణం చేశానని పేర్కొన్నారు. తన మాతృభాష కన్నడలో ప్రమాణం చేశానని, ఇది తన జీవితంలో మరువలేనిదన్నారు. అవి గర్వకారమనిపించే క్షణాలని పేర్కొన్నారు. భారత ప్రజాప్రభుత్వ ఆలయంలో అరుదైన ఘట్టంలో పాలుపంచుకున్నా అన్నారు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లకు కన్నడిగులందరికీ అనంత ధన్యవాదాలని రాసుకున్నారు. కర్ణాటకలో ఎమ్మెల్యేగా కొనసాగుతూ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో మండ్య నుంచి పోటీచేసి గెలుపొందారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా ప్రమాణం చేశాక ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు.

డ్రగ్స్ కేసులో చార్జ్‌షీట్ రద్దు చేసిన హైకోర్టు

బెంగళూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల కేసులో బెంగళూరు సీసీబీ పోలీసులు పారిశ్రామికవేత్త శివప్రకాశ్ అలియాస్ చిప్పిపై నమోదు చేసిన చార్జ్‌షీట్‌ను హైకోర్టు సోమవారం రద్దు చేసింది. 2020లో సెలెబ్రిటీలపై మాదకద్రవ్యాల కేసులు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం విదితమే. దీనిపై కోర్టు తీర్పు వెల్లడించడంతో న్యాయపోరాటంలో శివప్రకాశ్‌కు ఊరట లభించింది. 2020 సెప్టెంబరు 4న కాటన్‌పేట పోలీసులు మాదకద్రవ్యాల కేసులో నటి సంజనాగల్రాని, ఆదిత్య అగర్వాల్‌ను నిందితులుగా పేర్కొన్నారు. 2021లో ఇందుకు సంబంధించి వాదోపవాదాలు సాగాయి. మార్చి 25న అర్జీదారుడు సమర్పించిన పిటిషన్‌ను హైకోర్టు ఇటీవల స్వీకరించింది. చార్జ్‌షీట్‌లో ఎటువంటి మాదకద్రవ్యాలు సీజ్ చేసినట్టు ప్రస్తావించకపోవడం, నిందితుడికి ఎటువంటి రసాయన పరీక్షలు చేయకపోవడాన్ని శివప్రకాశ్ తరపు న్యాయవాది అమర్‌కొరియా వాదించారు.



ప్రాథమిక పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీలపై అంగన్‌వాడీల నిరసన

బెంగళూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీలను ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావడాన్ని వ్యతిరేకిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సోమవారం భారీ నిరసన చేపట్టారు. నగరంలోని ఫ్రీడంపార్కులో ఏఐటీయూసీ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. ఆరేళ్ల వయసు వచ్చే వరకు పిల్లల బాగోగులను అంగన్‌వాడీ కేంద్రాలు చూసుకుంటున్నాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో తమ మనుగడ ప్రమాదంలో పడిందని వారు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల గౌరవ వేతనం రూ.15వేలకు పెంచాలని, సహాయకులకు రూ.10వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


నిరసనలో భారీ సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు

17 మంది ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

- సీఎం కాళ్లు మొక్కిన బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి

నూతన ఎమ్మెల్సీలతో సీఎం, సభాపతి



బెంగళూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటాతోపాటు ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలనుంచి గెలుపొందిన 17మంది ఎమ్మెల్సీలు విధానసౌధ బ్యాంక్వెట్‌హాల్‌లో ప్రమాణం చేశారు. సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో సభాపతి బసవరాజ హొరట్టి, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, శాసనసభ వ్యవహారాలు, న్యాయశాఖల మంత్రి హెచ్‌కే పాటిల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఎమ్మెల్యేల కోటాలో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన సభ్యులు మంత్రి బోసరాజు, డాక్టర్ యతీంద్ర సిద్దరామయ్య, సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, ఐవాన్ డిసౌజా, జగదేవ్ గుత్తేదార్, వసంతకుమార్, బల్కిస్‌బాను, బీజేపీ నుంచి ఎన్నికైన సీటీ రవి, ఎన్ రవికుమార్, ములె మారుతిరావ్, జేడీఎస్ నుంచి గెలుపొందిన టీఎన్ జవరాయ గౌడ ప్రమాణం చేశారు. ఇక ఈశాన్యపట్టభద్రుల స్థానం నుంచి విజయం సాధించిన కాంగ్రెస్‌కు చెందిన చంద్రశేఖర్ పాటిల్, బెంగళూరు పట్టభద్రుల స్థానం గెలుపొందిన కాంగ్రెస్‌కు చెందిన రామోజిగౌడ, ఆగ్నేయ ఉపాధ్యాయ స్థానం నుంచి గెలుపొందిన కాంగ్రెస్‌కు చెందిన శ్రీనివాస్, నైరుతి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎన్నికైన బీజేపీకి చెందిన ధనంజయ్ సర్జి, నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి జేడీఎస్‌కు చెందిన ఎస్ఎల్ భోజేగౌడ, దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి జేడీఎస్‌కు చెందిన కె. వివేకానంద ప్రమాణం చేశారు.


సిద్దరామయ్య కాళ్లు మొక్కుతున్న సీటీ రవి

సీఎం కాళ్లు మొక్కిన సీటీ రవి


17 మంది ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారంలో బీజేపీ నేత సీటీ రవి ప్రమాణ స్వీకారం చేసిన వేళ బ్యాంక్వెట్‌హాల్‌లో అభిమానులు కేరింతలు కొట్టారు. ఆయన ప్రమాణ స్వీకారం ముగిసేదాకా అభిమానులు కేకలు, ఈలలతో బ్యాంక్వెట్‌హాల్‌లో మారుమోగించారు. ఆ తర్వాత సభాపతి బసవరాజహొరట్టి నుంచి నిబంధనల కిట్‌ను తీసుకునేందుకు వెళ్లిన సందర్భంలోనే సీటీ రవి ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాళ్లు మొక్కారు. రాజకీయంగా నిత్యం సిద్దరామయ్య లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేసే సీటీ రవి కాళ్లు మొక్కడం సర్వత్రా చర్చనీయాంశమైంది.


యతీంద్రకు కౌన్సిల్ కిట్ ఇస్తున్న సీఎం, సభాపతి


సీఎం కాళ్లు మొక్కుతున్న ఐవాన్ డిసౌజా


ప్రమాణం చేస్తున్న బల్కిస్‌బాను


జేడీఎస్ సభ్యులు భోజేగౌడ, జవరాయగౌడ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.73	1,579.36
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,056	187
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,037	285
సామర్థ్యం (టీఎంసీలు)	5.37	4.17



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గంగమ్మకు పూజలు

బళ్లారి సిటీ, జూన్ 24: వర్షాలు కురవాలని గంగా మాతకు పూజలు నిర్వహించారు. విజయనగరం జిల్లా కూడ్లిగి తాలూకా సమీపంలోని గజాపూర్ గ్రామంలో గంగామాతకు సోమవారం ప్రత్యేక పూజలు చేసి గంగా మాత ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని గంగామాత ఆలయం నుంచి మహిళలు, గ్రామస్థులతో కలిసి రోడ్డుపై ఉన్న రాతి బావి వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించి ఈ ఏడు మంచిగా వర్షాలకు కురవాలని, సమృద్ధిగా పంటలు పండి అందరూ సంతోషాలంగా ఉండాలని కోరుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈసందర్భంలో గంగామాత నాయకులు బారికర మంజునాథ్, నిజశరణ అంబిగర చౌడయ్య ట్రస్టు అధ్యక్షుడు గాలెప్ప, బీమప్ప, ఆంజనేయ, తిమ్మలాపూర్ హులుగప్ప, గ్రామా మాజీ సభ్యుడు మల్లికార్జున, దానకాయవ్వ గాళప్ప, బారికర కొట్రప్ప, శ్యామనూర్ హనుమంతప్ప,బారికర చీకప్ప, బారికర విశ్వనాథ్, ప్రకాశ్, నాగరాజు, గోవిందప్ప, మంజు, నిడుగుర్తి రాజా, రమేశ్ పాల్గొన్నారు.

మేయర్‌కు అభినందనలు



మేయర్ నందీష్‌ను సన్మానిస్తున్న బోయపాటి విష్ణు

బళ్లారి రూరల్, జూన్ 24: నగరంలో మహనగరపాలిక ఆవరణంలో మేయర్ నందీష్‌ను సోమవారం బోయపాటి విష్ణు అభినందించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని అభినందనలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

213 మంది గైర్హాజరు

రాయచూరు, జూన్ 24: జిల్లాలో సోమవారం ప్రారంభమైన ద్వితీయ పీయూసీ కన్నడ సబ్జెక్టుకు 213 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 1280 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1067 మంది హాజరు కాగా మిగిలిన వారు గైర్హాజరైనట్లు సంబంధిత శాఖ అధికారి సోమశేఖరప్ప హొర్కాణి తెలిపారు.

అడవి పందుల వేటగాళ్ల అరెస్టు

రాయచూరు, జూన్ 24: అడవి పందులను వేటాడి రాయచూరుకు తీసుకొస్తున్న ఇద్దరు నిందితులను జిల్లా సరిహద్దులో సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. యాదగిరి జిల్లా చిత్తాపురవైపు నుంచి రాయచూరుకు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో అడవి పందులతో పాటు వాటిని వేటాడేందుకు ఉపయోగించిన పరికరాలు పోలీసులకు లభించాయి. చిత్తాపూర్ తాలూకా ముడబూళ గ్రామ అటవి ప్రాంతంలో వాటిని వేటాడినట్లు నిందితులు అంగీకరించారు. వీరిని రాయచూరు జిల్లా లింగసుగూరు పట్టణానికి చెందిన సోమేశ్, అంబరీష్‌లుగా గుర్తించారు. అనంతరం అటవీ శాఖ అధికారుల ఆదేశాల మేరకు వారిని న్యాయస్థానానికి అప్పగించారు. చిత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు జిల్లా పోలీసులు తెలిపారు.



పోలీసుల అదుపులో వేటగాళ్లు

అనుమతి లేకున్నా అభివృద్ధి పనులు..!

● నిబంధనలు గాలికి వదిలేసిన ప్రజాపనుల శాఖ ● కేఆర్‌డీసీఎల్ ఎన్‌ఓసీ లేకున్నా ఫుట్‌పాత్ పనులు

బళ్లారి గాంధీనగర్, జూన్ 24: ఏదైనా రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలంటే అనుమతులు తప్పనిసరి. ప్రభుత్వ శాఖల సమన్వయలోపం కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. కర్ణాటక రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్(కేఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో రాష్ట్ర రహదారుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఎన్‌ఓసీ తప్పనిసరి అని బళ్లారి-విజయనగర జిల్లాల రాష్ట్ర రహదారుల అభివృద్ధి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ నాగనాథ్ పేర్కొంటున్నారు. సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడిన ఆయన ప్రస్తుతం బళ్లారి నగరం గుండా వెళ్లే 132వ రాష్ట్ర రహదారి 25కిలోమీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు విస్తరించి ఉందన్నారు. పదేళ్ల క్రితం కేఆర్‌డీసీఎల్, హైదరాబాద్‌కు చెందిన ఎస్‌ఈడబ్ల్యూ సంస్థ (పబ్లిక్ ప్రైవేట్ పర్టనర్షిప్) విధానంతో సుమారు 158కోట్ల రూపాయలతో 2011, మార్చిలో ప్రారంభించి 2013 పూర్తి చేశారన్నారు. రోడ్డు పూర్తి అయినప్పటి నుంచి 13ఏళ్లపాటు అంటే 2026వరకు ఎస్‌ఈడబ్ల్యూ సంస్థ ఈ రోడ్డు సమయం ఉందని, ఈ సమయంలో కేఆర్‌డీసీఎల్ అనుమతి లేకుండా ప్రస్తుతం ఉన్న రోడ్డులో అభివృద్ధి పనులు చేపట్టడం సరికాదన్నారు. అభివృద్ధి పనులకు తాము అడ్డుకాదని, అయితే ఒక సంస్థ ఆధ్వర్యంలో ఉన్న సమయంలో ఆ ప్రాంతంలో పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఈ రోడ్డు వచ్చే రెండేళ్లలో ప్రస్తుతం 132 రాష్ట్ర రహదారి జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ అవుతోందని, అలాంటి సమయంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రోడ్డుకు ఇరుప్రక్కల ఫుట్‌పాత్‌లు నిర్మించరాదన్నారు. జాతీయ రహదారుల శాఖ రోడ్డు వెడల్పు పనులు చేపబడితే నిధులు వృథా అవుతాయన్నరు. ఈ వషయం స్థానిక ప్రజాపనుల శాఖ అధికారులకు తెలిసినా... తమదృష్టికి తీసురాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటి జాతీయ రహదారులు శాఖ ఇదే రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలకు ఇతర కట్టడాల యజమానులకు హద్దులను తెలుపుతూ నోటీసులు జారీ చేసిందన్నారు. హడావుడిగా పనులు చేపట్టి నిధులను వృథా చేయడం తగదన్నారు.



రోడ్డు నిర్వహణలో ఉందని, పనులు చేపట్టరాదని చూపుతూ కేఆర్‌డీసీఎల్ ఏర్పాటు చేసిన బోర్డు

వేస్ట్ మట్టి స్థానంలో నాణ్యమైన మట్టి..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బళ్లారి గాంధీనగర్, జూన్ 24: 'ఫుట్‌పాత్ నిర్మాణానికి వేస్ట్ మట్టి' పేరుతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ప్రజా పనుల శాఖ అధికారులు స్పందించారు. తక్షణమే ఫుట్‌పాత్ వెంట నాసిరకం మట్టిని తొలగించి నాణ్యమైన మట్టిని వేయించారు. వృథాగా ఉన్న మట్టితో ఫుట్‌పాత్ పనులు చేపట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి(కేకేడీబీ) పరిధిలోకి వచ్చే బళ్లారి జిల్లా అభివృద్ధికి ఏటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తోంది. నిధులు నీరుగారి పోతున్నాయని, ఈ విషయంలో అధికారులు, ప్రజా పనుల్లో మార్పురావాలని ప్రజాసంఘాలు ధ్వజమెత్తుతున్నాయి. అధికారులు నాణ్యమైన మట్టి వాడడంపై పలువురు ఆంధ్రజ్యోతిని ప్రశంసించారు.





ఫుట్‌పాత్‌పై వేసిన నాసిరకం మట్టి.. అనంతరం తొలగించి వేసిన ఎర్రమట్టి

అవినీతి సీఎం రాజీనామా చేయాలి

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప డిమాండ్

సిరుగుప్ప, జూన్ 24 : అవినీతికి పాల్పడిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప డిమాండ్ చేశారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో బీజేపీ ఆందోళన చేపట్టారు. బీజేపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ.. తాలుకాలో దందాలు, ఇసుక మాఫియా, ఎర్రమట్టి, పేకాట జోరుగా జరుగుతున్నాయని ధ్వజ మెత్తారు. జిల్లా ఎస్పీ ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాలుకా బీజేపీ సీనియర్ నాయకులు దరప్ప మాట్లాడుతూ రూ.187 కోట్ల అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలించ డానికి అర్హత కోల్పోయిందన్నారు. ఎన్నికల ముందు ధరలు పెంచేది లేదన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాట తప్పిందన్నారు. వాల్మీకి కార్పొరేషన్ నిధులు రూ. 187 కోట్లను తెలంగాణ ఎన్నికలకు రవాణా చేసినట్లు ఆరోపించారు. అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వుండే అర్హత కోల్పోయారన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి సిద్దరామయ్య నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, బీజేపీ నాయకుడు దరప్ప తదితరులు



క్షయపై అవగాహన కల్పిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

క్షయపై ఇంటింటి అవగాహన

బళ్లారి సిటీ, జూన్ 24: క్షయ వ్యాధిపై అధికారులు ఇంటింటి అవగాహన కల్పించారు. సోమవారం నగరంలోని గుగ్గరహట్టి ప్రాంతంలో పర్యటించిన డీహెచ్ఓ రమేష్ బాబు క్షయ నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు ఆరు నెలలు చికిత్స పొందాలని, క్షయ రహిత జిల్లాకు చేతులు కలపాలన్నారు. మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ వ్యాధి కారణంగా వచ్చే క్షయవ్యాధిని నిర్మూలించేందుకు అందరూ చేతులు కలపాలన్నారు. ఎవరికైనా రెండు వారాలకు పైగా దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, సాయంత్రం జ్వరం రాత్రిపూట చెమటలు పట్టడం, కపంలో రక్తం, ఛాతీనొప్పి, ఆకలి మందగించడం వంటి లక్షణాలుంటే సమీప ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. అన్ని కేంద్రాల్లో మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీ పేషెంట్‌గా రెండేళ్లపాటు చికిత్స అందించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట గుగ్గరహట్టిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుప్తా, షాహిన్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్ ఆరోగ్య సిబ్బంది నిరంజన, ఈరయ్య, ఉమ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతులను అర్థవంతంగా నిర్వహించాలి: తహసీల్దార్

బళ్లారి సిటీ, జూన్ 24: మహనీయుల జయంతులను అర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ గౌసియా బేగం పేర్కొన్నారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కెస్వాన్ వీడియో హాల్లో సోమవారం వివిధ ప్రముఖుల జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ముందస్తు సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 27న కెంపెగౌడ జయంతి, జూలై 2న హలకట్టి జన్మదినం సందర్భంగా నగరంలోని సాంస్కృతిక సముదాయభవనంలో వచన సాహిత్య సంరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రతికాత్మకంగా నిర్వహించాలన్నారు. ప్రతి తాలూకా కేంద్రాల్లో కెంపెగౌడ జయంతిని తప్పనిసరిగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. తాలూకా స్థాయి పాఠశాలల్లో కెంపెగౌడపై వ్యాసరచన ప్రసంగం, సప్తాహ జాతా కార్యాక్రమాలు నిర్వహించాలని డీడీపీఐని ఆదేశించింది. నేటి తరానికి పెద్దమనిషి తత్వాలను తెలియజేసేందుకు నైపుణ్యం కలిగిన రిసోర్స్ పర్సన్లతో ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి కార్యక్రమంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులు సామాన్య ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ గౌసియా బేగం

విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు ప్రదానం

బళ్లారిరూరల్, జూన్ 24: నగరంలోని డీసీ కార్యాలయం ఎదురుగా ఎల్‌ఎల్‌సీ, పీయుసీ జాబితాలో 90 మార్కులకు పైగా సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. బ్రహ్మానంద స్వామీజీ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు భక్తి భావం కలిగి ఉండాలన్నారు. ముఖ్య అతిథి నగరపాలక సంస్థ సభ్యులు అశోక్ కుమార్ మాట్లాడుతూ చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునేలా స్వామీజీ ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యా శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి మోహన్ కిషోర్ పిల్లలకు విద్య ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు జీవితంలో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీ చంద్రశేఖర్ , ఏకలవ్య ట్రస్టు కార్యదర్శి ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అద్భుతంగా ప్రదర్శన ఇచ్చినందుకు స్వామీజీ, అతిథి ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున కుమారుడు దీపక్‌తేజ్, వీకే బసప్ప, వాల్మీకి నాయకులు సహకరించారు. కృష్ణమూర్తి డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మణ్, మాజీ డైరెక్టర్ అనసూయ మురార్జీ దేశాయ్ ప్రసంగాలు, పుష్పలత, కళావతి, గోవర్ధన్‌సాయి సంజయ్ కుమార్, గిరీష్, మేఘన పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

బళ్లారి సిటీ,జూన్ 24: విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని సన్మార్గ స్నేహితు బృందం అధ్యక్షులు చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సంజీవరాయనకోట ప్రభుత్వపాఠశాలలో సన్మార్గ స్నేహితుల బృందం భువనేశ్వరీదేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ ప్రారంభించారు. విద్యార్థులు గురువాలను పెద్దలను గౌరవించాలన్నారు. దేవుడిపై భక్తిని పెంపొందించుకుని ఆధ్యాత్మికత అలవరచుకోవాలన్నారు. మరో సభ్యుడు మహేశ్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు మంచి పౌరులుగా ఎదగాలన్నారు. అలాగే దర్మాన్ని పెంపొందించేకోవాలని నేల, భాషను గౌరవించాలన్నారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్ళగుర్కి, మిత్రబృందం జ్ఞానదేవ, శేకన్న, ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం, చన్నమ్మ, సుమతి, సుధ, వైశాలి, శ్వేత, ఉమ్మెహాని, శశమ్మ, రామాంజనేయులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సన్మార్గ స్నేహితుల బృందం

కోరం లేక సమావేశం రద్దు

హోసూరు, జూన్ 24: హోసూరు పంచాయతీ యూనియన్‌లో 16 మంది కౌన్సిలర్లు ఉండగా సోమవారం పంచాయతీ యూనియన్ కమిటీ సమావేశం జరగాల్సి ఉంది. హోసూరు రీజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (వి.ఎఫ్) కుమరేశన్ పంచాయతీ యూనియన్ కమిటీ అధికారి (సి.ఎఫ్), సిరాజ్ మహమ్మద్ పంచాయతీ యూనియన్ కమిటీ అధ్యక్షుడు శశి వెంకటస్వామి విచ్చేశారు. ఈ సమావేశానికి కేవలం నలుగురు పంచాయతీ కమిటీ కౌన్సిలర్లు మాత్రమే హాజరుకాగా కౌన్సిలర్లు తగినంత లేని కారణంగా కోరం కొరతతో సమావేశం రద్దు చేశారు.

కొండపై తవ్వకాలను వ్యతిరేకిస్తూ ఎస్‌యూసీఐ ఆందోళన

బళ్లారి సిటీ,జూన్ 24: సస్యశ్యామలమైన సండూరు కొండపై ఇనుప ఖనిజం తవ్వకాలకు అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌యూసీఐ నిరసన చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం గనులను లీజుకు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బళ్లారి జిల్లా కమిటీ సభ్యులు సోమశేఖర్‌గౌడ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ 25ఏళ్లలో గనుల తవ్వకం పూర్తిగా యాంత్రీకరణ తర్వాత గనుల నుంచి తరలిస్తున్న ఖనిజం వేలరెట్లు పెరిగిందన్నారు. అదే సమయంలో ఇనుము ధర శాతం పెరగడం గనుల యజమానులకు వరంగా మారిందన్నారు. ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయని, రైతులకు కార్మికులకు, పర్యావరణానికి, సామాన్యులకు శాపంగా మారిందన్నారు. విధ్వంసకర మైనింగ్ జరగడంతో వాతావరణంలో దుమ్ము, ధూళి పరిమితికి మించి ప్రసరిస్తుం దన్నారు. సండూరు పరిసర ప్రజలు ప్రాణాంతక వ్యాదుల బారిన పడుతున్నారు. రైతుల పశువులు, గొర్రెలు ఎదుగుదల లేక మృత్యువాత పడుతున్నాయన్నారు. వర్షాలు తగ్గి సండూరు బీడు ప్రాంతంగా మారుతోం దన్నారు. దేవగిరి కొండ తవ్వకాలకు ఖుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీకి ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలన్నారు. ఎస్‌యూసీఐ దేవదాస్ మాట్లాడుతూ పశ్చిమ కనుమల్లో ఎన్నోఏళ్లుగా తవ్వకాలు జరుపుతూ అటవీ చట్టాలను ఉల్లంఘించారన్నారు. దేవగిరి కొండలో 470 హెక్టార్లు(1.161ఎకరాలు) ఇచ్చారని, సస్యశ్యామలమైన కొండను తవ్వకాలకు ఇవ్వరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రులకు, అటవీ శాఖ మంత్రికి వినతి ప్రతం సమర్పించారు. నిరసనలో నాయకులు డాక్టర్ ప్రమోద్‌కుమార్, శాంత, నాగరత్న, ఈశ్వరి, జగదీశ్ తదితరులున్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌యూసీఐ సభ్యులు

హోసూరు జోన్

జస్టిస్ చంద్రు నివేదిక రద్దు చేయాలి

హోసూరు, జూన్ 24: మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న రిటైర్డు జస్టిస్ చంద్రు నివేదికను రద్దు చేయాలని కోరుతూ హిందూ మున్నణి సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు హోసూరులోని రాంనగర్ అన్నా విగ్రహం వద్ద సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహాసభలో హిందూ మున్నణి రాష్ట్ర కార్యదర్శి కుట్రాళనాథన్ సమావేశంలో పాల్గొని విలేఖరులతో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం రిటైర్డ్ జడ్జ్ జస్టిస్ చంద్రు నేతృత్వంలో తమిళనాడు ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించారన్నారు. నివేదికలో ఇందులో పాఠశాలల్లో కులతత్వ నిర్మూలనకు విద్యార్థులు తిలకం ధరించరాదని, చేతులకు తాడు కట్టుకోవద్దని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. నివేదికలోని ఈ ప్రస్తావనలు బాధాకరమన్నారు. తిలకధారణ అనేది హిందూ సంప్రదాయమని కులాలకు అతీతంగా ధరిస్తారన్నారు. నుదుటిపై తిలకం పెట్టడం, విభూతి పూయడం తమిళుల సంస్కృతిలో భాగంగా ఉందన్నారు. కుల సమస్యలను అరికట్టడానికి బదులుగా విద్యార్థులను సంఘాల ఎన్నికలు నిర్వహి ంచేలా సూచిస్తోందని, ఇందులో రాజకీయాలు జోక్యం చేసుకుంటే సమస్యలు పెరుగుతాయన్నారు. కావున ఈ నివేదికలోని అంశాలు సమంజసం కాదని నివేదికను రద్దు చేయాలని సంఘం డిమాండ్ చేసింది.

ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులకు ఇక్కట్లు


హోసూరు, జూన్ 24: హోసూరు నగరంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై తరచుగా ట్రాఫిక్ జామ్ చోటు చేసుకుంటోంది. గంటల తరబడి వందలాది వాహనాలు బారులు తీరుతుండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. హోసూరు నుంచి బెంగళూరు వెళ్లే వాహనాలు, హోసూరు నుంచి కృష్ణగిరి వెళ్లే వాహనాలు రెండు ప్రధాన రహదారులపై సుమారు ఐదు కిల్లోమీటర్లకు పైగా వాహనాలు బారులు తీరాయి. దీంతో సమయానికి గమ్యం చేరలేని పరిస్థితి నెలకొంది.



బారులుదీరిన వాహనాలు

కార్మికుల నిరాహార దీక్ష

హోసూరు, జూన్ 24: రవాణాశాఖ కార్మికులు 7 అంశాల డిమాండ్‌ల సాధన కోసం హోసూరు వర్క్‌షాప్ ఎదుట సీఐటియూ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్, ట్రాన్స్‌పోర్ట్ రిటైర్డ్ వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. సోమవారం ఉదయం చేపట్టిన నిరాహారదీక్ష 24 గంటల పాటు కొనసాగుతుందని సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ప్రభాకరన్ తెలిపారు. సీఐటీయూ నగర శాఖ అధ్యక్షుడు అరుణ్, జిల్లా అధ్యక్షులు వాసుదేవన్ నిరాహర దీక్ష చేపట్టారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజ్, ధర్మపురి జోన్ ప్రధాన కార్యదర్శి షణ్ముగం, కృష్ణగిరి జిల్లా కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీధరన్ డిమాండ్లను వివరించారు. బడ్జెట్ కేటాయింపుల్లో రవాణా రంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డు కార్మికులను ఖాళీ చేతులతో పంపించవద్దని, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిటైర్డ్ ఉద్యోగులకు 104 నెలల టీఆర్ పెంపును వెంటనే ఇవ్వాలని, కొత్త పెన్షన్ విధానం వద్దనే ప్రధాన డిమాండ్‌లు, 2003 తర్వాత సర్వీసులో చేరిన వారికి, వారసులకు 5 వేలకు పైగా మరణించిన కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. కూలీలకు, వారసులకు పని కల్పించండి. యుద్ధప్రాతిపదికన 25 వేలకు పైగా ఖాళీలను భర్తీ చేయాలని, 15వ వేతన కమిషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో సిఐటియూ ప్రాంతీయ శాఖల నిర్వాహకులు, రిటైర్డ్ పేరెంట్స్ అసోసియేషన్ నిర్వాహకులు గోవిందన్, రాజీ, త్యాగరాజన్, కుమార్, గోవిందరాజ్, సత్యనాథన్, శరవణన్, బాలాజీ, అరుల్, ఉమర్‌ఫారూక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం నాయకులు

పబ్లిక్ సర్వీస్ డేపై అవగాహన

హోసూరు, జూన్ 24: ఐక్యరాజ్యసమితి ప్రజాసేవా దినోత్సవం సందర్భంగా హోసూరు లయన్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోసూరు రామనాయకన్ సరస్సు చిల్డ్రన్స్ పార్క్ ధ్యాన మంటపంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. హోసూరు రెసిడెంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శరవణన్, అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షత వహించారు. షణ్ముగవేల్, అరిమా సంఘ అధ్యక్షుడు డా.వి.ఎస్. రెడ్డి, ఆడిటర్లు మణి, శ్రీనివాసన్, కళారాణి, విభాగం అధికారి బాబు సహజ పర్యావరణం, ప్లాస్టిక్ నిర్మూలన, సేవా కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రామనాయకన్ సరస్సు ఒడ్డున ఉన్న పార్కులో ప్రకృతిని కాపాడేందుకు మొక్కలు నాటారు. ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు ఉద్యానవనాన్ని శుభ్రపరిచారు. నరసింహలుతోపాటు వలంటీర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

డాక్టర్ కమల హంపన్నకు నివాళి



నివాళి అర్పిస్తున్న జడేసిద్దేశ్వర ట్రస్టు సభ్యులు, విద్యార్థులు

కంప్లి, జూన్ 24 : జడే సిద్దేశ్వర ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ కమల హంపన్నకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు శివన్న గౌడ రామప్ప మాట్లాడుతూ డాక్టర్ కమల హంపన్న మహిళగా ఎన్నో కవితలు రాసి రాష్ట్రంలో గుర్తుండిపోయారు. ఎప్పటికీ ఆమెను మరువలేమన్నారు. కవులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ట్రస్టు పదాధికారులు, చించెన శ్రీలక్ష్మి, పల్లవి, జేష్టవి, వీణ, రాధిక, అంకిత, శీన, ఐశ్వర్య, చందన పాల్గొన్నారు.

పదాధికారుల నియామకం

కంప్లి, జూన్ 24 : భారత సేవాదళ్ విజయనగర జిల్లా సంఘం పదాధికారుల సమావేశం హోస్పేటలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బళ్లారి జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి నేతృత్వంలో భారత సేవాదళ్ పదాధికారుల నియామకం జరిగింది. విజయనగర జిల్లా అధ్యక్షుడిగా సుబ్బయ్య స్వామి, ఉపాధ్యక్షుడిగా బాలి విజయ్‌కుమార్ గౌడ, కార్యదర్శిగా చిదానంద, కోశాధికారి పత్రి హిరేమట్, రాష్ట్ర సభ్యులు చెన్న వీరయ్య స్వామి తదితరులు నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఎన్ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాభావానికి ముందుకు రావాలని అప్పుడే భారత సేవాదళ్‌కు గుర్తింపు వస్తుందన్నారు.



నూతనంగా ఎన్నికైన సేవాదళ్ పదాధికారులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మదన్ మోహన్ (జయంతి)



ప్రముఖ సంగీతదర్శకుడు మదన్ మోహన్ కోహ్లి 1924 జూన్ 25న అప్పటి బ్రిటీష్ ఇరాక్‌లోని బాగ్దాద్‌లో జన్మించారు. హిందీ సినీరంగంలో 1950, 70 దశకాల మధ్య తనదైన ముద్రను చాటారు. పాతికేళ్లలో వందకుపైగా సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. కాగా గజల్స్‌కు ఆయన అందించిన సంగీతం ఎంతో ప్రత్యేకత. మెలోడియస్ డైరెక్టర్‌గా పేరొందారు. మహ్మద్ రఫీ, తలాత్ మొహమ్మద్, లతా మంగేష్కర్, ఆశాభోంస్లే వంటి ప్రముఖ గాయకులతో కలసి పనిచేశారు. ఉత్తమ సంగీత దర్శకుడిగా పలుమార్లు పురస్కారాలు అందుకున్నారు. 1975 జూలై 14న కన్నుమూశారు.

జార్జ్ మైఖేల్ (జయంతి)



ప్రముఖ ఆంగ్ల గాయకుడు జార్జ్ మైఖేల్ 1963 జూన్ 25న జన్మించారు. గేయరచయిత, రికార్డు ప్రొడ్యూసర్‌గాను పేరొందారు. పాప్ మ్యూజిక్ సంస్థ 'వామ్' స్థాపకులలో ఒకరు. తర్వాత సొంతంగా ఎదిగి సత్తా చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 115మిలియన్ రికార్డ్స్ అమ్ముడయ్యాయి. 1989 గ్రామీ అవార్డులలో ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు. సంగీతప్రపంచంలో ఇదో రికార్డు. 2 గ్రామీ అవార్డులు, 3 బ్రిట్ అవార్డులు, 3 అమెరికన్ మ్యూజిక్ అవార్డులు, 12 బిల్‌బోర్డ్ మ్యూజిక్ అవార్డ్స్, 4 ఎంటీవీ వీడియో మ్యూజిక్ అవార్డ్స్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2016 డిసెంబరు 25న కన్నుమూశారు.

డాక్టర్ ఎన్. గోపి (పుట్టినరోజు)



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించిన ఆచార్య ఎన్. గోపి 1950 జూన్ 25న తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా (అప్పటి నల్గొండ జిల్లా) భువనగిరిలో జన్మించారు. పూర్తిపేరు ఎన్. గోపాల్. తెలుగు పండితుడు, కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు సహా 30కుపైగా పురస్కారాలు అందుకున్నారు. అధ్యాపక వృత్తిలో కొనసాగిన ఆయన 30దాకా పుస్తకాలు ప్రచురించారు. ఇందులో కవితా సంకలనాలు కూడా ఉన్నాయి. వేర్వేరు యూనివర్సిటీల నుంచి 5 పీహెచ్‌డీలు, 4 ఎంఫిల్‌లు అందుకున్నారు.

ఇసుక అక్రమ రవాణా

ఫొటోలు తీస్తున్న విలేకరులపై దాడి



రాత్రిపూట ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

పావగడ, జూన్ 24 : తాలూకా పరిధిలోని పులిబెట్ట తండా సమీపం నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుకను అక్రమ రవాణాపై ఫొటోలు తీసేందుకు ఆదివారం రాత్రి వెళ్లిన విలేకరులపై దాడిచేసి వారి మొబైల్‌లను లాక్కున్నారు. తాలూకా పరిధిలోని శ్రీరంగపురం ఎన్ఎంతండాకు చెందిన శివశంకర్ నాయక్, యాదికుంట గ్రామానికి చెందిన రామాంజనేయ కలిసి నాగులమడక ఉత్తర పినాకిని నది నుంచి ఇసుకను తరలించేందుకు నాలుగు ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. వారు రోజూ రాత్రి పూట పావగడ, వివిధ ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని రొప్పం గ్రామస్థులు వాపోతున్నారు. ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు తీసేసి, ఎలాంటి అనుమతులు లేకుండానే భారీగా ఇసుకు తరలిస్తున్నారన్నారు. అక్రమంగి ఇసుక తరలించే ట్రాక్టర్లు రొప్పం గ్రామంలో నంచి ఇళ్ల మధ్యలో కూడా అతి వేగంగా వెళుతుండడంతో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయని తెలిపారు. దీనిపై పోలీసులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. తిరుమణి, పావగడ పోలీసులు వారి నుంచి ముడుపులు తీసుకుంటూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండి పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇసుక అక్రమరవాణాపై ఫోటోలు తీసేందుకు వెళ్లిన విలేకరులపై అక్రమార్కులు దాడులు చేశారని వాపోయారు. విలేకరులపై దాడిని ఖండిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదన్నారు. ఆంధ్రా పోలీసులు కూడా ముడుపులు తీసుకుంటూ రొద్దం సరిహద్దులోని నారనాగేపల్లి, గౌరాజుపల్లి మీదుగా ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని గ్రామస్థులు వాపోతున్నారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు

పావగడ, జూన్ 24 : గత మూడు రోజుల క్రితం కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మాచరాజనహళ్లి గ్రామ సమీపంలో మడకశిర మండలం యల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్క హత్యకేసులో నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని సోమవారం విచారణ చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా మృతురాలు చంద్రక్క కొడుకు, కోడలు, ఇతర ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అయితే చంద్రక్క వద్ద ఉన్న డబ్బు, నగల కోసమే వివాదం వివాదం తలెత్తి ఈ హత్య జరిగినట్లు పోలీసు విచారణలో తేలింది. అయితే ఈ హత్యలో ఎవరెవరు పాల్పడ్డారని మరిన్ని వివరాలు పోలీసు విచారణలో తేలనుందని తెలిపారు.

నేడు వినాయక ఆలయ వార్షికోత్సవం

హిందూపురం అర్బన్, జూన్ 24: పట్టణ పరిధిలోని టీచర్స్ కాలనీలో వెలసిన వరసిద్ధి వినాయక దేవాలయం 12వ వార్షికోత్సవాలను మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సోమవారం ఓ ప్రకటన లో పేర్కొంది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 7 గంటలకు అభిషేకాలు చేస్తామన్నారు. అనంతరం 8 గంటలకు 108 కలశాల స్థాపన, 9 గంటలకు హోమాలు, అనంతరం పూర్ణాహుతి, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మనసును నియంత్రణలో ఉంచుకోవాలి

శిడ్లఘట్ట, జూన్ 24: మానవుడు తన మనసును నియంత్రణలో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మనసు అడిగినదల్లా మంచి చెడు గుర్తించకుండా ముందుకు సాగితే కష్టాలు తప్పవని ఆదిచుంచనగిరి మఠం చిక్కబళ్ళాపురశాఖ మంగళానందస్వామిజీ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దిబ్బూరహళ్ళి రోడ్డులోని హనుమంతపుర గేట్ సమీపానగల బీజీఎస్ స్కూల్‌లో సోమవారం స్వస్తి 2024 కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనస్సులో ఎన్నో ఆలోచనలు వస్తుంటాయని వాటిలో జీవిత పురోగతికి దోహదపడేవి ఎంతవరకు ఉన్నాయనేది మనం ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మనస్సు నిర్మలంగా ఉంచుకోగలిగితే సరైన నిర్ణయాలు తీసుకునే వీలుంటుందన్నారు. తక్కువ మార్కులు పొందిన విద్యార్థులు నిరాశ చెందకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తెచ్చేలా వ్యవహరించాలని హితవు పలికారు. బిజీఎస్ పాలనాధికారి శివరాంరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయల పాత్రను వివరించారు. ఎస్ఎస్ఎల్ఎస్‌సీ, పీయూసీలో ఎక్కువమార్కులు సాధించినవారిని సన్మానించారు. డాక్టర్ ధనంజయరెడ్డి, డాక్టర్ గిరీశ్, లహరి తదితరులు పాల్గొన్నారు.



స్వస్తి కార్యక్రమంలో స్వామిజీ తదితరులు

భద్రకాళి ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం

దొడ్డబళ్ళాపుర, జూన్ 24: తాలూకా కేంద్రం నడిబొడ్డున సౌందర్యమహల్ రోడ్డులో శిథిలావస్థలో ఉన్న ప్రసిద్ధ భద్రకాళి సమేత వీరభద్రుడి ఆలయ జీర్ణోద్ధరణకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఇందుకుగాను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓబదేనహళ్ళి మునియప్ప నేతృత్వంలో వీరశైవసంఘం పదాధికారులు, బోవి సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునియప్ప మాట్లాడుతూ చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన భద్రకాళి సమేత వీరభద్రుడి ఆలయం శిథిలావస్థకు చేరిందన్నారు. సదరు ఆలయాన్ని అభివృద్ధి చేయాలని తీర్మానించగా బోవి, వీరశైవ సముదాయ ప్రముఖులు చొరవ చూపారన్నారు. సుమారు 200 ఏళ్లనాటి ఆలయాన్ని బాగు చేసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని సోమణ్ణ తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు పలువురు దాతలు సహకరించ నున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వీరశైవసంఘం అధ్యక్షుడు సోమరుద్రశర్మ, కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి గిరీశ్, ప్రముఖులు పణీశ్, పరమేశ్, గిరీశ్, శివనందప్ప, మంజు నాథ్, ఉమాపతి, సిద్దణ్ణ, నగరసభ సభ్యుడు పద్మరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ జీర్ణోద్ధరణ పూజల్లో స్థానిక ప్రముఖులు

ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వహణకు వేలం



వేలంపాటలో పాల్గొన్న కమిషనర్

శిడ్లఘట్ట, జూన్ 24: పట్టణంలోని శుద్ధతాగునీటి కేంద్రాలు (ఆర్‌ఓ ప్లాంట్)ల నిర్వహణకు ఆసక్తిగల కంట్రాక్టర్‌లనుంచి నగరసభ టెండర్‌లు పిలిచింది. నగరసభ సభాంగణంలో కమిషనర్ మంజునాథ్ అధ్యక్షతన సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. కోర్టు వెనుకభాగానగల 13వ వార్డు శుద్ధతాగునీటి కేంద్రానికి రూ.13,600 బాడుగగా హుసేన్ తన బిడ్‌లో కోట్ చేశారు. 7శుద్ధ తాగునీటి కేంద్రాలు ఉండ గా కేవలం ఒక కేంద్రానికి మాత్రమే బిడ్ దాఖలైంది. నీటి కేంద్రాల నిర్వహణకు బిడ్ సమర్పించేందుకు ఎస్సీ కేటగిరీ వారికి రూ.25వేలు, జనరల్ కేటగిరీ వారికి రూ.50వేలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. బిడ్ దక్కించుకున్నవారు 47 నెలల పాటు నిర్వహణను కంట్రాక్టు పొందవచ్చు. బిడ్ ప్రకారం నెలవారీ నగరసభకు బాడుగ చెల్లించాల్సి ఉంటుంది. ఆర్‌ఓ ప్లాంట్‌కు అవసరమైన నీటిని నగరసభ సమకూర్చనుంది. ప్రజలకు 20లీటర్ల నీటికి 5 రూపాయలు మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుంది. ఇలా పలు షరతులు విధించారు. కాగా పలువురు వేలం ప్రక్రియను వాయిదా వేయాలని కంట్రాక్టర్‌లు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న శుద్ధతాగునీటి కేంద్రాలను బాగు చేయాలంటే లక్షల రూపాయల ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. తొలుత శుద్ధతాగునీటి కేంద్రాలను బాగు చేసి ఆ తర్వాత నిర్వహణకు టెండర్‌లు పిలవాలని నగరసభ సభ్యులు తదితరులకు డిమాండ్ చేశారు. 7 కేంద్రాలకు గాను కేవలం ఒక్క కేంద్రానికి మాత్రమే బిడ్ రావడంతో దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ఘనంగా అణ్ణమ్మదేవి ఉత్సవం

దొమ్మసంద్ర, జూన్ 24: ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలో గ్రామదేవత అణ్ణమ్మదేవి 14వ వార్షిక మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి విశేషపూజల అనంతరం పురవీధులలో ఊరేగించారు. భక్తులు టెంకాయలుకొట్టి సమర్పించారు. యువజనసంఘం అంగడివీధి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బెంగళూరు నగరంలోని మెజస్టిక్ నుంచి అణ్ణమ్మదేవి ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తిని తెచ్చి విశేషపూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఏటా నిర్వహిస్తున్న తరహాలోనే ఈ సంవత్సరం కూడా అణ్ణమ్మదేవి ఉత్సవం జరిపినట్టు నిర్వాహకులు తెలిపారు.



అణ్ణమ్మదేవికి ప్రత్యేక అలంకరణ

వీధికుక్కల దాడిలో 12 గొర్రెల మృతి

బాగేపల్లి, జూన్ 24: గొర్రెల పెంపకంపైనే ఆధారపడిన కుటుంబానికి వీధికుక్కల దాడి పెను షాక్ ఇచ్చింది. తాలూకాలోని గిరియప్పల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా గొర్రెలదొడ్డిలోకి చొరబడిన వీధికుక్కలు దాడికి పాల్పడ్డాయి. దీంతో 12 గొర్రెలు మృత్యువాత చెందాయి. పదికిపైగా గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం సమాచారం సమాచారం అందుకున్న పశువైద్యాధికారి జయశంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన గొర్రెలకు చికిత్సలు అందించారు. గ్రామపంచాయతీ సభ్యుడు జీవీ నరసింహప్ప మాట్లాడుతూ కానగమాకలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గిరియప్పల్లి గ్రామంలో ఈరమ్మకు 28 గొర్రెలు ఉన్నాయని కుక్కల దాడిలో 12 మృతి చెందాయన్నారు. వీటివిలువ సుమారు 1.50 లక్షల రూపాయలుగా ఉంటుందన్నారు. రైతు కుటుంబానికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, వీరి విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చు గొర్రెల పెంపకంపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.



మృతి చెందిన గొర్రెలతో గ్రామస్థులు

నాసిరకంగా కాలువ ఆధునికీకరణ పనులు

రాయచూరు, జూన్ 24 : నారాయణపూర్ కుడికాలువ పరిధిలోని కేబీజేఎన్ఎల్ ఉప కాలువ ఆధునికీకరణ పనులు పూర్తి నాసిరకంగా జరుగుతున్నాయని కర్ణాటక రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ ఆరోపించారు. ఈ విషయంలో విచారణ కోసం నియమితులైన అధికారులు తూతుమంత్రంగా విచారణ చేస్తుండడం రైతులకు ఆందోళనకరంగా మారిందన్నారు. సోమవారం లింగసుగూరు పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పనులను కాంట్రాక్ట్ పొందిన కంపెనీ తాము స్వయంగా పనులు నిర్వహించకుండా సబ్‌లీజ్‌కు ఇవ్వడం వల్ల పనులు పూర్తి అస్తవ్యస్తంగా సాగుతున్నాయని తెలిపారు. కాలువ వెంబడి నిర్మించాల్సిన సర్వీస్ రోడ్డును కేవలం మరం వేసి నామమాత్రంగా పూర్తి చేశారని అసహనం వ్యక్తం చేశారు. కాగా ఇప్పటి వరకు కాలువకు నీటిని విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చామరస మాలిపాటిల్ విమర్శించారు. మరమ్మతులను సకాలంలో పూర్తి చేసి జూలై నెలలో నీటి విడుదలకు అధికారులు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకపోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై మండిపడిన సుప్రీంకోర్టు తగిన ఆదేశాలు ఇవ్వడంతో కేంద్రం నిధులు విడుదల చేసిందని పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం అసమర్థ విధానాల వల్ల సాంకేతిక కారణాల పేరుతో బాధిత రైతులకు ఇప్పటికీ పరిహారం అందకపోవడం శోచనీయమన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన కళ్లు తెరిచి పంట నష్టానికి గురైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే విషయమై ఈ నెల 26న తాము ఆందోళన నిర్వహిస్తున్నట్లున్నట్లు తెలిపిన చామరస మాలిపాటిల్ బాధిత రైతులందరూ ఆందోళనలో భాగస్వాములుకావాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రాజ్యాంగం గురించి మాట్లాడే నైతికత కాంగ్రెస్‌కు లేదు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి - ఎమర్జెన్సీ వ్యతిరేక పోస్టర్ల ఆవిష్కరణ

రాయచూరు, జూన్ 24 : రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ రెడ్డి అన్నారు. వ్యక్తిగత రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన దుష్ట చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని ధ్వజమెత్తారు. దేశంలో ఎమర్జెన్సీని విధించి 47 ఏళ్లు పూర్తైన సందర్భంగా సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లోని బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పార్టీ పని చేస్తుందని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చేసిన అబద్ధపు ప్రచారం హాస్యాస్పద మని పేర్కొన్నారు. నిజంగా వారికి రాజ్యాంగం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, రాహుల్‌గాంధీ అందరూ తొలుత దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి బీజేపీకి మాత్రమే సాధ్యమని ఈ విషయంలో బీజేపీకి ఏ ఇతర పార్టీ నుంచి సర్టిఫికెట్ అవసరం లేదన్నారు. ఎమర్జెన్సీ నాటి అణచివేతల గురించి తీవ్రస్థాయిలో బీజేపీ నాయకులు మండిపడ్డారు. అనంతరం ఎమర్జెన్సీ వ్యతిరేక పోస్టర్లను విడుదల చేశారు.



ఎమర్జెన్సీ వ్యతిరేక పోస్టర్లను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

సక్రలో 425 శస్త్ర చికిత్సలు

బెంగళూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సక్ర వరల్డ్ ఆసుపత్రిలో మే నెలలో 425 ఎముకల సమస్యలకు సంబంధించి శస్త్రచికిత్సలు జరిగాయని సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. న్యూరో విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ మార్గదర్శకంలో 15మందికిపైగా నిపుణులైన బృందం పాల్గొన్నారన్నారు. 275మందికి మోకాలిచిప్పల మార్పిడి రికార్డుగా ఉందన్నారు. శస్త్ర చికిత్స పొందిన వారిలో గరిష్ఠంగా 83ఏళ్లు, కనిష్ఠంగా 46ఏళ్ల వయసువారు ఉన్నారన్నారు. కేవలం నెలరోజుల్లోనే భారీ సంఖ్యలో శస్త్ర చికిత్సలు నిర్వహించడం గర్వకారణమన్నారు. గత 11ఏళ్లలో 30వేలకుపైగా ఎముకల సమస్యలకు సంబంధించిన శస్త్రచికిత్సలు జరిగాయన్నారు. రోగి సమస్యను గుర్తించి అందుకు అనుగుణంగా చికిత్సలు ఇవ్వడంలో నిపుణులైన వైద్యులు ఉన్నారని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నయో మత్సోమి తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల్లో ఆశ

బాగేపల్లి, జూన్ 24: ఎక్కువ వడ్డీ ఇస్తామని ఆశ చూపి భారీగా డిపాజిట్‌లు పొందిన అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఎంతోమంది బాధితులు ప్రస్తుతం ఆశగా ఎదురుచూస్తున్నారు. చిన్న, మధ్యతరగతి వర్గాల వారు కష్టకాలంలో ఆదుకుంటుందని కడుపు మాడ్చుకుని కూడబెట్టిన డబ్బును కూడా అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా కర్ణాటకలోనూ అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారు. బాగేపల్లి పట్టణం, తాలూకా వ్యాప్తంగా 500మందికిపైగా ఉన్నట్టు అంచనా. ఏపీలోని వైసీపీ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని ఇచ్చిన హామీ అమలుకాలేదు. ప్రస్తుతం ఏపీలో ప్రభుత్వం మారడంతో తమ డిపాజిట్లు వాపసు వస్తాయేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. సామాన్యులు, బడుగుల కష్టాలను ఆలకించే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ చూపు తారన్న ఆశతో ఉన్నారు. అదే జరిగితే ఇన్నాళ్లు వేచి ఉన్నందుకు తగిన ఫలితం దక్కుతుందని బాధితులు భావిస్తున్నారు.

వారపుసంత స్థలాన్ని అభివృద్ధి చేయండి



వారపుసంత (ఫైల్)

చేళూరు, జూన్ 24: చేళూరు తాలూకాలోని ఏనిగదలె గ్రామపంచాయతీ కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారపుసంత ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. ఇక్కడి వారపుసంతకు చుట్టుపక్కల 16 గ్రామాల ప్రజలు వస్తుంటారు. సంత ప్రదేశాన్ని అభివృద్ధి చేయడం లేదా కొత్త ప్రదేశం కల్పించడం ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సౌకర్యం కలగడంతో పాటు వ్యాపారం పెరిగి పంచాయతీకి ఆదాయం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేడు జనస్పందన

బాగేపల్లి, జూన్ 24: తాలూకా సభాంగణంలోని కార్యాలయంలో మంగళవారం జనస్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ ప్రశాంత్ కె పాటిల్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనస్పందనకు చిక్కబళ్ళాపుర జిల్లా అధికారి రవీంద్ర, జడ్పీ ముఖ్య అధికారులు పాల్గొని ప్రజల సమస్యలు ఆలకిస్తారన్నారు. తాలూకా ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని తెలిపారు.

నెలంతా రేషన్ ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న స్లం వాసుల క్రియా వేదిక నాయకులు

రాయచూరు, జూన్ 24 : నిరుపేదలు మురికివాడల్లో నివసించే వారి సౌకర్యం కోసం రేషన్ దుకాణాల్లో అందించే సరుకులను నెల మొత్తం అందజేసేలా ఏర్పాటు చేయాలని స్లం వాసుల క్రియావేదిక నాయకులు కోరారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయంలో వారు వినతి పత్రం ఇచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నివాసముంటున్న స్లం వాసులు సకాలంలో రేషన్ అందక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. కొన్ని దుకాణాల్లో బయోమెట్రిక్ విధానం లోబోయిష్టంగా ఉండడం వల్ల ఒక రోజు థంబ్ తీసుకోవడం మరుసటి రోజు సరుకులు ఇవ్వడం వంటి జరుగుతుండడంతో రెండు రోజుల పాటు పనులను వదిలి చౌకదర దుకాణం చుట్టూ తిరగాల్సి వస్తుందని జిల్లాధికారి కార్యాలయంలో వివరించారు. ఈ పరిస్థితిని నివారించేందుకు నెలంతా సరుకులు అందించాలన్నారు. ఆశ్రయకాలనీ మైలార్‌నగర్ తదితర ప్రాంతంలో ఉండే వారికి చౌకధర దుకాణాలు దూరంలో ఉండడంతో వారు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తెచ్చారు.